# శుష్క వాగ్దానాలు | తీరని రైతుల వెతలు

**నరేంద్రమోడీ** నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చిలకపలుకులు పలుకుతున్నది. ఇప్పటికీ రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధరను పొందలేకపోతున్నారు. కాగా కనీస మద్దతు ధర ఆచరణలో అత్యధిక అమ్మకపుధరగా మారింది. ప్రభుత్వం రైతుల కందజేసే సబ్సిడీలన్నింటినీ దాదాపుగా తొలగించివేశారు. ప్రకృతి దయా దాక్షిణ్యాలకు రైతులు వదలివేయబడ్డారు. రైతాంగం అత్యధికులు రుణ ఊబిలో కూరుకుపోయి, దాని నుండి బయటపడలేక ఆత్మహత్యలకు పాల్పడు తున్నారు. వరుసగా పాలన సాగిస్తూ వస్తున్న ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితమే ఈ విషాద పరిస్థితి. వ్యవసాయాన్ని పండుగలా మారుస్తామని, లాభదాయకం చేస్తామనే గొప్పగొప్ప వాగ్దానాలు చేస్తూ; ప్రపంచ వ్యవసాయ మార్కెట్‌లో ధరలను దేశీయ పంటలకు కల్పిస్తామంటూ, మరోవైపున పంటల ధరలను తగ్గించివేసే చర్యలను చేపడుతున్నారు.

భారతదేశం 1970ల నాటికి దేశ వంట నూనెల వినియోగంలో 5 శాతం కంటే తక్కువగా- (లక్ష టన్నుల కంటే తక్కువగా,) దిగుమతి చేసుకునేది. 1980 నాటికి ఇది 15 లక్షల టన్నుల దిగుమతికి పెరిగింది. 1988 నాటికి 20 లక్షల టన్నులకు చేరుకుంది. ముడి చమురు దిగుమతి తర్వాత వంటనూనెల దిగుమతే అధిక స్థానంలో వుంది. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తికి ప్రతి దశలోనూ ఆర్థిక సహాయం అందిస్తూ ప్రభుత్వం 'టెక్నికల్ మిషన్'ను అమలు చేసింది. నూనెగింజల సాగు, శుద్ధిచేసే పరిజ్ఞానం, నూనెగింజలకు గిట్టుబాటుధర కల్పించడం దీని లక్ష్యాలు. దిగుమతు లపై పన్నులు అధికంగా వేయటం, కానలైజేషన్‌ల ద్వారా నియంత్రించటం దీని కర్తవ్యాలు. ఫలితంగా ఒక ఆరు సం॥ల స్వల్ప కాలంలోనే దేశీయ వంటనూనెల ఉత్పత్తి 78 శాతం పెరిగి, 1 కోటీ 13 లక్షల టన్నుల నుండి 2 కోట్ల టన్నులకు చేరుకుంది. అలాగే వంటనూనెల దిగుమతులు 1992-93 నాటికి లక్ష టన్నులకు తగ్గిపోయాయి.

సామ్రాజ్యవాద గుత్తసంస్థలు నిర్దేశించిన నయా వుదారవాద ఆర్థిక విధానాలు, దాని క్రమంలోనే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటివో) ముందుకొచ్చాయి. 1994లో పామోలిన్ ఆయిల్‌పై 65శాతంగా వున్న దిగుమతి సుంకాన్ని ఒక్కసారిగా 1997 నాటికి 25 శాతానికి తగ్గించివేశారు; 1998 నాటికి 15 శాతానికే తగ్గించివేశారు. కారుచౌకగా పామోలిన్ ఆయిల్ దేశాన్ని ముంచెత్తింది. దేశీయ నూనె గింజల ఉత్పత్తి దారుణంగా దెబ్బతింది. ఆ దెబ్బనుండి ఈనాటికీ కోలుకోలేదు. సాంప్రదాయ వంటనూనె గింజల సాగు ధ్వంసమైపోయింది. ఆ రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. ఎందరో ఆత్మహత్యల పాల్పడ్డారు. వందలాది చిన్నతరహా వంటనూనె తయారీ పరిశ్రమలు మూతబడ్డాయి. అందులో పనిచేసే కార్మికులు రోడ్డున పడ్డారు.

ప్రపంచంలోనే వంటనూనెల దిగుమతిలో భారతదేశం ఈనాడు అతి పెద్దదిగా వుంది. 65,000 కోట్ల రూ॥ విలువైన 1 కోటీ 50లక్షల టన్నులకు పైగా వంటనూనెలను ప్రతిఏటా మనం దిగుమతి చేసుకుంటున్నాము. ఈ దిగుమతులలో పామోలిన్ ఆయిల్ ప్రధానంగా వుంది. ఏడాది పొడవునా దిగుబడి నిచ్చే పంటరకం ఇది. అమెరికాకు చెందిన బంగే అనే బహుళజాతి కంపెనీ, మలేషియాలో భారీ పామాయిల్ ప్లాంటేషన్‌లను కలిగివుంది. వాటికి తగిన మార్కెట్‌ను మనదేశం కల్పించిందన్న మాట!

పామాయిల్ భారతదేశపు పంటల ఉత్పత్తిలో భాగమూకాదు; 1970 నాటికి మనదేశంలో వాడకం లోనూ లేదు. దేశీయ వంటనూనెల వినియోగంలో పామాయిల్ వాడకం 22 సం॥ల కాలంలో 2 శాతం నుండి 50 శాతానికి పెరిగింది. ఫలితంగా 2 కోట్ల 6 లక్షల ఎ కరాలలో వంటనూనెలు సాగుచేసే కోట్లాదిమంది రైతాంగం ఎన్నో తీవ్రమైన ఆర్థిక సమస్యల నెదుర్కొన్నారు. ఎక్కువ భాగం వీరిలో మెట్టప్రాంత రైతులున్నారు. వీరికి ఎటువంటి సాగునీటి సౌకర్యాలు లేవు. వీరికి నూనెగింజల సాగుమినహా మరో ప్రత్యామ్నాయపంట లేదు.

నూనె గింజల ఉత్పత్తిలో భారత రైతాంగం స్వయంపోషకం సాధించగలరని గత అనుభవం చూపుతున్నప్పటికీ, ప్రభుత్వం భారత రైతాంగాన్ని బలిచేస్తూ, భారత ప్రజల ఆరోగ్యాన్ని హరించివేస్తూ పామాయిల్ దిగుమతులను ప్రోత్సహించే విధానమే కొనసాగిస్తోంది. ఇది కేవలం బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమేననేది స్పష్టమే. రైతులకు సాగునీటి వసతి కల్పించేందుకు, సేవలను విస్తరించేందుకు, సబ్సిడీలవంటి ఆర్థిక సహాయ, సహకారాలందజేసేందుకు ప్రభుత్వం ఏవిధమైన చర్యలూ తీసుకోవటం లేదు. వ్యవసాయరంగానికి ఇచ్చే సబ్సిడీలు దేశ ఆర్థికవ్యవస్థకు పెనుభారంగా తయారయ్యాయని చెబుతోంది. భారత రైతాంగం వ్యవసాయంలో నిష్ణాతులని మరోవైపు కితాబు లిస్తోంది.

ఈలాంటి ప్రభుత్వాలు రైతుల ఆదాయాలను రెట్టింపు జేస్తాయనటాన్ని ఎవరైనా ఎలా ఊహించ గలుగుతారు? అలాంటి భ్రమలకు లోనుకావట మంటే దాహం తీర్చుకోవటానికి ఎండమావుల వెంట పరుగులెత్తటమే కాదా?!

oooo